

### మిషన్ భగీరథ నీళ్లు సరిపడా వస్తలేవు

వారంలో మూడు రోజులు నల్లా నీళ్లు రావడం లేదు. వచ్చినా నాలుగు బిందెలే నింతుడు తున్నయి. అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి.

**-సుతారి భాగ్యమ్మ, బస్వన్నపల్లి**

### చేద బావితో నీటి కష్టాలు తీరుతున్నయ్..

నేను 20 ఏండ్ల క్రితం ఇంటి నిర్మాణ సమయంలో చేద బావి తోడుకున్నా. దీంతో నీటి కష్టాలు దూరమైనయి. కుళాయిలో నీళ్లు రాని రోజు చుట్టపక్కల వారు వచ్చి బావి నుంచి నీటిని తీసుకెళ్తారు.

**- మంగళి కిష్టయ్య, బస్వన్నపల్లి**







బస్వన్నపల్లిలో చేదబావిని తవ్వకుంటున్న ఓ కుటుంబం

# చేద బావులే దిక్కు!

- బస్వన్నపల్లిలో తాగునీటి కష్టాలు
- ఎత్తిపోయిన బోరు బావులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ప్రభుత్వం

రాజంపేట్, మార్చి 27: వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పల్లెల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. తాగునీటి కోసం వేసిన బోర్లు ఎత్తిపోవడంతో నీటి ఎద్దడి తీవ్రంగా మారింది. కామారెడ్డి జిల్లా రాజంపేట, బస్వన్న పల్లిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీళ్లే సరఫరా అవుతున్నాయి. కొంతకాలంగా నీటి సరఫరా అంతంతమాత్రంగానే రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. భగీరథ పథకం నిర్వహణలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో గ్రామాలకు నీటి ఇబ్బందులు తప్పడంలేదు. ప్రైవేట్ బోర్లను హైరింగ్ తీసుకున్నప్పటికీ సరిపోవడం లేదు. రూ.వెయ్యి నుంచి 12వందలు ఖర్చు పెట్టి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. నీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రెండు బోర్లు వేయించినప్పటికీ చుక్కనీరు పడలేదు. దీంతో గ్రామాల్లో తాగునీరు అందించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

**50 చేద బావులు**

బస్వన్నపల్లి గ్రామంలో దాదాపు 50 చేద బావులు ఉన్నాయి. గతంలో నీటి అవసరాల కోసం ఇండ్ల ముందు ఉన్న చేద బావులను తోడుకున్నారు. ప్రస్తుతం నీటి ఇబ్బందులు తలెత్తడంతో మళ్లీ చేద బావులను ఆశ్రయించాల్సి వస్తున్నది.

**బోర్లు వేసినా కానరాని నీటి జాడలు**

నీటి సమస్య పరిష్కారం కోసం కొందరు తమ ఇండ్ల ముందు బోర్లు వేయిస్తున్నారు. కానీ పది మందిలో ఒక్కరికీ మాత్రమే నీళ్లు రావడంతో బోర్లు వేయడానికి జంకుతున్నారు. బోర్ల కన్నా బావులే నయమని భావించి, కొత్తగా చేత బావులను తవ్విస్తున్నారు.

### నాలుగు బిందెలు కూడా నిండడంలేదు..



ప్రతి రోజు నల్లా సరిగ్గా రావడం లేదు. రెండు రోజులకొకసారి వచ్చినా నాలుగు బిందెలు కూడా నిండడంలేదు. బోరు వేద్దామంటే పడుతుందన్న గ్యారంటీ లేదు. అందుకే చేసేదేమీలేక సొంతంగా చేద బావి తవ్విస్తున్న. నీళ్లు రావాలని వేడుకుంటున్న.

**-ఎర్రం దర్శనం, బస్వన్నపల్లి**

### ప్రభుత్వమే బావులు తవ్వించాలి



ఎన్ని బోర్లు వేసినా ఫెయిలవుతున్నయి. గతంలో ప్రభుత్వం నాలుగు బావులు తవ్వించగా అవి ఇప్పుడు కొద్దిగా ఉపయోగపడుతున్నాయి. అలాగే మరి కొన్ని బావులను తవ్విస్తే నీటి సమస్య తీరుతుంది.

**-గడ్డం విఠల్ రెడ్డి బస్వన్నపల్లి**

### ప్యాకేజీ -21 (ఏ) పనులు
# త్వరగా పూర్తిచేయాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

**అసెంబ్లీలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

మోర్తాడ్, మార్చి 27: జిల్లాలో ప్యాకేజీ -21 (ఏ) పనులు త్వరగా పూర్తి చేసి రైతాంగానికి సాగునీటిని అందించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం జీరో అవర్‌లో వేముల మాట్లాడారు. బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాలతోపాటు మెట్‌పల్లి సెగ్మెంట్‌లో సుమారు 2లక్షల 12 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు నిర్దేశించిన ప్రాజెక్ట్ ప్యాకేజీ -20, 21, 21ఏ అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 70 శాతం పనులు పూర్తిచేశామని, మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేయించాలని కోరారు. ముఖ్యంగా ప్యాకేజీ- 21 (ఏ) మెట్‌పల్లి సెగ్మెంట్‌లో 12వేల ఎకరాలు, బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలకు కలిపి 80వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలంలో 28వేల ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో 6వేల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చని వివరించారు.

**'లిఫ్ట్' పనులు కూడా పూర్తిచేయాలి**

గత ప్రభుత్వం ఎస్సీరెస్పీ ద్వారా సుమారు 9,274 ఎకరాలకు సాగునీటిని అందించడానికి రూ.150 కోట్లతో చిట్టాపూర్, ఫతేపూర్, సర్బిర్యాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు నెమ్మదిగా సాగుతున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి ఎత్తిపోతల పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.

# కటకటాల్లోకి నిందితులు

- జుక్కల్‌లో గణిత ప్రశ్నల లీకేజ్ కేసు..
- ఇద్దరు మైనర్లు సహా 8 మంది అరెస్టు..
- పరారీలో మరో ముగ్గురు నిందితులు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి, మార్చి 27: పదో తరగతి గణిత ప్రశ్నల లీకేజ్ కేసులో నిందితులను కటకటాల్లోకి పంపించారు పోలీసులు. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలోని పరీక్షా కేంద్రం నుంచి బుధవారం గణిత ప్రశ్నలు బయటకు వచ్చిన ఉదంతం కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఇద్దరు మైనర్లు సహా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు.

జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి రాస్తున్న ఓ విద్యార్థికి సాయం చేసేందుకు అతడి తండ్రి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. గణిత పరీక్ష రాస్తున్న విద్యార్థి ఐదు ప్రశ్నలను తెల్ల కాగితంపై రాసి, పరీక్షా కేంద్రంలో నీళ్లు సరఫరా చేస్తే వ్యక్తితో బయటికి పంపించాడు. ఆ కాగితాన్ని తీసుకున్న విద్యార్థి తండ్రి.. అందులో ఉన్న ప్రశ్నలకు జవాబులు తీసుకురావాలని తనకు సన్నిహితుడైన కారోబార్‌కు పేపర్ ఇచ్చాడు. ఆ కాగితాన్ని అక్కడే ఉన్న విలేకరికి పంపించగా, అతడి నుంచి యూట్యూబ్ రిపోర్టర్‌కు, అక్కడి నుంచి మరో రిపోర్టర్‌కు వాట్సప్‌లో చేరింది. ఆ పేపర్ క్లిప్పింగ్‌ను లోకల్‌గా ఉన్న డిజిటల్ మీడియా గ్రూప్‌లో పోస్ట్ చేయడంతో ప్రశ్నలు బయటకు వచ్చిన విషయం వైరల్ అయింది. ఈ విషయం తెలుసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ రంగంలోకి దిగడంతో మొత్తం బాగోతం బయటకొచ్చింది. మాల్ ప్రాక్టీస్‌కు ప్రయత్నించిన ఈ ఉదంతంలో 11 మందిపై కేసులు నమోదు కాగా, ఎనిమిది మందిని అరెస్టు చేశారు. అందులో ఇద్దరు మైనర్లు, ఆరుగురు మేజర్లు ఉన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. అరెస్టయిన వారిలో ఓ యూట్యూబ్ చానల్ విలేకరి, వాట్సప్ గ్రూప్ అడ్మిన్ కూడా ఉన్నారని చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్బీ సీఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# 'బోనస్ పైసలు బొక్కేశారు'

- కోటగిరి సొసైటీ పరిధిలో రూ.20 లక్షలు గోల్‌మాల్
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

కోటగిరి, మార్చి 27 : సన్నరకం వడ్లకు ప్రభుత్వం ఇచ్చిన బోనస్ డబ్బును రైతుల ముసుగులో కొందరు ప్రజాప్రతినిధులు బొక్కేశారని బీజేపీ నేతలు ఆరోపించారు. కోటగిరిలో గురువారం కొందరు నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సొసైటీ పరిధిలో జరిగిన ఈ అవినీతిలో రూ.20 లక్షలకు పైగానే కొల్లగొట్టారన్నారు. సొసైటీలో 618 మంది రైతులు ధాన్యం విక్రయించగా, మరికొందరు ప్రైవేట్‌లో అమ్ముకున్నారని చెప్పారు. అయితే, బోనస్ డబ్బుల చెల్లింపులో జరిగిన జాప్యాన్ని కొందరు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా మార్చుకున్నారన్నారు. తమ కుటుంబ సభ్యుల పేరిట కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం విక్రయించినట్లు ట్రక్ షీట్లు రాసుకుని, మిల్లర్లతో కుమ్మక్కై పెద్ద మొత్తంలో బోనస్ డబ్బును స్వాహా చేసినట్లు ఆరోపించారు. అసలు వ్యవసాయమే చేయని వ్యక్తుల ఖాతాల్లోనూ, రైస్‌మిల్ యజమాని అకౌంట్‌లోనూ బోనస్ డబ్బులు జమ కావడం విచిత్రమని తెలిపారు. కోటగిరి సొసైటీ పరిధిలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి, అవినీతిపరుల నుంచి డబ్బు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

### విద్యాశాఖ నిర్లక్ష్యంతోనే
# ప్రశ్నాపత్రాల లీకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ నాయకుడు అభిలాష్



**బీఆర్‌ఎస్వీ నాయకుల ఆగ్రహం**

ఖలీల్‌వాడి, మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనంతోపాటు విద్యాశాఖ నిర్లక్ష్యంతోనే పదో తరగతి ప్రశ్నాపత్రాలు లీకైనట్లు బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు ఆరోపించారు. జుక్కల్‌లో పదోతరగతి పరీక్ష ప్రశ్నల లీక్ నేపథ్యంలో గురువారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్వీ జిల్లా యువజన నాయకుడు అభిలాష్ మాట్లాడుతూ.. నకిరేకల్, మంచిర్యాల, వికారాబాద్, జుక్కల్‌లో పేపర్ లీకైందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ నాలుగు పరీక్షలు నిర్వహిస్తే, నాలుగు ప్రశ్నాపత్రాలు లీకవడం చూస్తుంటే విద్యాశాఖ ఎంత నిర్లక్ష్యంగా ఉన్నదో అర్థమవుతున్నదని మండిపడ్డారు. కార్పొరేట్ స్కూళ్లతో కుమ్మక్కై కాంగ్రెస్ ఎమ్మెల్యేలే లీకులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కోరితే, సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కేటీఆర్‌పై నకిరేకల్‌లో అక్రమ కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పేపర్ లీకేజీ కేసులో అసలు నిందితులను తప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్నదని, తాము న్యాయపరంగా కొట్లాడుతామన్నారు. సమావేశంలో చిన్నారం (రమేశ్), ప్రశాంత్, మధు, గంగాధర్, నితిన్, యూనుస్, రాజు, అజయ్ పాల్గొన్నారు.


# నమ్మించి.. నట్టేటా ముంచి..

- 30 మంది నుంచి రూ.కోటి వసూలు చేసిన బీజేపీ నాయకురాలు
- తిరిగి ఇవ్వకుండా చేతులెత్తేసిన మహిళ
- లబోదిబోమంటున్న బాధితులు

వినాయక్‌నగర్, మార్చి 27: ఒకటికి రెండింతలు ఇస్తానని రూ. కోటి వసూలు చేసి చివరికి చేతులెత్తేసింది బీజేపీకి చెందిన ఓ మహిళా నాయకురాలు. దీంతో బాధితులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడికి గురువారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పూసలగల్లీకి చెందిన ఆకుల నీలిమ, వినయ్‌కుమార్ దంపతులు కొంతకాలంగా తమ కులానికి చెందిన వారిని మచ్చిక చేసుకున్నారు. తమ వద్ద డిపాజిట్ రూపంలో డబ్బులు పెట్టుబడిగా పెడితే వాటిని రెట్టింపు చేస్తామని మహిళలను నీలిమ నమ్మించింది. దీంతో 30 మంది మహిళలు సుమారు రూ.85 లక్షల వరకు నీలిమకు అప్పజెప్పారు. ఇటీవల తమ డబ్బులు ఇవ్వాలని మహిళలు అడుగగా, తన వద్ద ప్రస్తుతం డబ్బులు లేవని నీలిమ చెప్పడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. దీంతో బాధిత మహిళలందరూ నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారికి గురువారం ఫిర్యాదు చేశారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరారు.

# ఈసీ..ఏడాదిగా ఖాళీ!

- నూతన పాలకవర్గ నియామకంపై సర్కార్ నిర్లక్ష్యం
- రేసులో పోటీ పడుతున్న రాజకీయ నిరుద్యోగులు
- విద్యావేత్తలకు అవకాశం కల్పించడంపై సందిగ్ధం
- వర్సిటీ భూముల అన్యాక్రాంతంపై ప్రభుత్వ పెద్దల మౌనం
- తనదైన మార్క్‌ను చూపిన గత ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్



**టీయూలో ఇష్టారాజ్యం.. గందరగోళం**

నిజామాబాద్, మార్చి 27, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ యూనివర్సిటీ పాలన అస్తవ్యస్తంగా మారింది. పాలకవర్గం గడువు గతేడాది ఫిబ్రవరితో ముగియగా.. ఇప్పటివరకూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించడంలేదు. ఈసీ నియామక ప్రక్రియకు ఒక్క అడుగు కూడా ముందుకుపడకపోవడం గమనార్హం. వర్సిటీ నిర్వహణకు కీలకమైన ఈసీ లేకపోవడంతో ప్రస్తుతం జవాబుదారీతనం లేకుండా పోయింది. అసలేం జరుగుతున్నదో తెలియని పరిస్థితి నెలకొన్నది. రహస్యంగానే ఫైళ్ల కదలికలకు వీసీ, రిజిస్ట్రార్లు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. పద్ధతి ప్రకారం ఏవైనా కార్యకలాపాలు నిర్వహించాలంటే ఈసీ ఉంటేనే సాధ్యమవుతుంది. పాలకవర్గంలో ఆయా అజెండా అంశాలను చర్చించి, కూలంకషంగా అనుమానాలను నివృత్తి చేసుకున్న తర్వాతే ఈసీ ఆమోదంతో ఏ కార్యక్రమమైనా చేపట్టాల్సి ఉంటుంది. ఈసీ లేకపోవడంతో కొంతకాలంగా వర్సిటీలో ఇష్టారాజ్యం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం రాకపోతేనే నయం అనే ధోరణిలో టీయూ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి చేతుల్లోనే విద్యాశాఖ ఉన్నది. విశ్వవిద్యాలయాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా మంత్రి లేడు. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవీ లేదు. ఇన్‌చార్జి మంత్రి ఉన్నా తూతూ మంత్రంగానే పర్యటనలు చేసి మమ అనిపిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం టీయూ వ్యవహారాన్ని గాలికి వదిలేశారు.

**కానరాని కసరత్తు?**

గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పొడవునా టీయూ పాలకవర్గం నియామకంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో పాటు రాజకీయ రంగు పులుముకుంటున్నది. ఈసీ సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. ఇంత వరకూ ప్రకటన విడుదల కాలేదు. రేపో మాపో ఈసీ వస్తుందంటూ ఊహాగానాలు చక్కర్లు కొట్టడమే తప్ప, వాస్తవానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ రూపకల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిన దాఖలాలే కనిపించడంలేదు.

**ఈసీ మెంబర్ కోసం పైరవీలు షురూ!**

ఈసీలో మెంబర్‌గా కొనసాగేందుకు కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు పైరవీలు షురూ చేసినట్లు సమాచారం. రాజకీయ నిరుద్యోగులకే చోటు కల్పించేందుకు సర్కారు సుముఖత వ్యక్తం చేసినట్లు టీయూ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయాలకతీతంగా నియామకం చేపడితే వర్సిటీ గాడిలో పడేందుకు అవకాశం ఉంటుంది. భారీ లక్ష్యాలను పెట్టుకుని ఈసీ నియామకంలో జాప్యం చేయడం, సభ్యులుగా పైరవీ చేసుకునే వారికే చోటు కల్పించే దిశగా పావులు కదుపుతుండడంతో సర్కారు లక్ష్యాలు నెరవేరబోవని విద్యావేత్తలు భావిస్తున్నారు. చెప్పేదొకటి చేసేదొకటి అన్న రీతిలో ప్రభుత్వం పని చేస్తున్నదంటూ విద్యార్థి సంఘా లు విమర్శిస్తున్నాయి. విద్యార్థ్వేతలు, అకడమిక్ అనుభవాలు పక్కన పెట్టి సర్కారుకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతున్నది.

**వర్సిటీలో అసలేం జరుగుతోంది...?**

టీయూకి సంబంధించిన 50ఎకరాలకు పైగా విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై హైకోర్టులో కేసు సాగింది. విచారణ సమయంలో టీయూ వర్గాలు ఆసక్తి చూపకపోవడంతో విలువైన భూముల కేసులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండగా టీయూ వర్గాలు స్పందించడం లేదు. టీయూ భూములను న్యాయపరంగా కొట్లాడి దక్కించుకోవాల్సిన పెద్దలు ఇప్పుడు మౌనంగా ఉండిపోతున్నారు. ఇదే హైకోర్టులో విచారణలో ఉన్న మరో వివాదాస్పద అంశాన్ని రాత్రికి రాత్రే చేతుల్లోకి తీసుకుని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్ కాపీ ఆధారంగా ముగింపు పలికేందుకు పాకులాడుతుండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. టీయూ పెద్దల తీరు ఒక్కో వ్యవహారంలో ఒక్కోలా కనిపిస్తుండడంపై విద్యార్థుల్లోనూ అనుమానాలకు తావిస్తోంది. వర్సిటీలో కొత్త కోర్సులు, పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉండగా వాటిని గాలికి వదిలేసి, వివాదాస్పద అంశాల జోలికి వెళ్లడంపై చర్చ నడుస్తున్నది. టీయూలో మితిమీరుతున్న ఆగడాలకు చెక్ పడాలంటే పాలకవర్గం నియామకమే నూటికి నూరు శాతం కరెక్ట్ అని టీయూ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా పనులు జరిగేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

### రెండురోజుల్లో నీటి సమస్య పరిష్కారం

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**



కాలనీలో నీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

### తొర్తిలో పర్యటించిన అధికారులు

ఏర్గట్ల, మార్చి 27: మండలంలోని తొర్తిలో గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని వేంకటేశ్వరాలయం వెనుక ఉన్న కొత్తప్లాట్ కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నది. కొంతకాలంగా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడంలేదు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'తాగునీటి కోసం భగీరథ ప్రయత్నం' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. గ్రామంలోని కొత్త ప్లాట్ కాలనీలో మిషన్ భగీరథ ఏఈ స్వరాజ్, ఎంపీవో శివ చరణ్ పర్యటించారు. నీటి సమస్య గురించి ఇంటింటికీ తిరుగుతూ కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యాత్మక ప్రాంతాల్లో పైపులైన్‌ను పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది పరిశీలించారు. రెండు రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.